కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -226 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 27-08-2026 | గురువారం | పేజీలు : 4

# తెలంగాణ ప్రాజెక్టులపై జగన్ ఆగ్రహం!



- కరువుపై చంద్రబాబు మౌనం
- 625 మండలాల్లో లోటు వర్షపాతం
- రైతుల్ని ఆదుకోవడంలో విఫలం
- నీళ్లివ్వకుండా రైతులకు నష్టం
- రాయలసీమకు నీటిపై నిర్లక్ష్యం
- రెండు ప్రాజెక్టులపై జగన్ ఫైర్
- రూ.1,844 కోట్ల ప్రాజెక్టుల ఆరోపణ
- పంటల బీమాపై ప్రభుత్వాన్ని నిలదీత
- కరువుపై కార్యాచరణ ఏదీ?

**న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ . మొత్తం 28 జిల్లాలకు గాను 25 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని.. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతాల్లో తీవ్రమైన కరువు ఉందన్నారు. జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 52 శాతం వర్షపాతం నమోదైందని.. మొత్తం 688 మండలాల్లో 625 మండలాల్లో లోటు వర్షపాతం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా ఇప్పటి వరకు రైతుల్ని ఆదుకునే చర్యలేవీ తీసుకోలేదని... రాబోయే రోజుల్లో పరిస్థితులు మరీ దారుణంగా ఉండబోతున్నాయన్నారు.

రాష్ట్రాన్ని కరువు కాటేస్తున్నా చంద్రబాబు కళ్లు తెరవడంలేదన్నారు జగన్. కరువుతో ఇబ్బందిపడే రాయలసీమ ప్రాంతంతో పాటుగా ఇప్పుడు కోస్తాలోనూ అలాంటి పరిస్థితులే చూస్తున్నామన్నారు.

మిగతాది 2 లో..

# కులగణనపై కాంగ్రెస్ ఫైర్!



- గడ్కరీ వ్యాఖ్యలతో కలకలం
- కొత్త తరానికి బాధ్యతలు
- గడ్కరీ మాటలపై హాట్ టాపిక్
- ఈ-20పై విమర్శల వేడి
- కేబినెట్ మార్పులపై ఊహాగానాలు
- మంత్రి కార్యాలయం క్లారిటీ
- ట్రస్ట్ బాధ్యతలకే పరిమితమని వివరణ
- రిటైర్మెంట్ ప్రచారానికి చెక్

**న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్):** రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల కాలంలో సెంటర్ ఆఫ్ డిస్కషన్ గా మారుతున్నారు. ముఖ్యంగా ఈ-20 పెట్రోల్ విషయంలో గడ్కరీ చేస్తున్న వాదనలపై వాహనదారుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో గడ్కరీ పేరు నిత్యం వార్తల్లో నిలుస్తూనే ఉంది. అయితే ఇథనాల్ బ్లెండెడ్ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్న నితిన్ గడ్కరీ రాజకీయాలకు గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నారా?

2 లో

# తిరుపతిలో కూలిన భవనం!



**న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్):** తిరుపతిలో నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. ఆర్సీరోడ్డులోని ఎంఆర్‌పల్లి వాణినగర్‌లో గ్యాస్ గోడౌన్ దగ్గర కొత్త భవనం నిర్మాణం కోసం గుంతలు తీస్తుండగా ఈ ఘటన జరిగింది.

# బిహార్ బిగ్ ఫైట్‌లో చిన్నోడే హైలైట్!



- త్రివర్ణంతో వైరల్ అయిన బాలుడు
- పోలీసులతో వెళ్లిన ఆరేళ్ల ఆదిత్య
- అరెస్టా? అధికారుల స్పష్టత లేదు
- బస్సుపై జెండాతో నినాదాలు
- మొదటి తూటా నాపైనే అన్న బాలుడు
- పేపర్ లీకులపై చిన్నారి ఆగ్రహం
- ఆదిత్య వీడియోలు వైరల్

**న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్):** కొన్ని రోజులు బిహార్ లో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలు ఉద్రిక్తతలకు దారి తీసింది. మంగళవారం బీహార్ రాజధాని పాట్నాలో నిరుద్యోగులు నిర్వహించిన ర్యాలీలో పోలీసులు లాఠీ ఛార్జ్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు.

2 లో

# పేపర్ లీక్ ఎఫెక్ట్.. ఎగ్జామ్ క్యాన్సిల్!




- డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎగ్జామ్ క్యాన్సిల్
- లీకేజీ ఆరోపణలపై ఎంపీఎస్సీ యాక్షన్
- పరీక్షకు ముందే ప్రశ్నపత్రం లీక్
- సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన పేపర్
- అక్రమాలపై అభ్యర్థుల ఫిర్యాదులు
- ప్రాథమిక విచారణలో అవకతవకలు
- మొత్తం నియామక ప్రక్రియ రద్దు

# హిజాబ్‌పై ఒవైసీ ఫైర్!



- ‘నిర్ణయించడానికి జడ్జీలు ఎవరు?’
- ఇస్లాంపై దాడిగా అభివర్ణన
- రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన అంటూ ఆరోపణ
- ముస్లిం బాలికల విద్యపై ఆందోళన
- మత విశ్వాసాల్లో జోక్యం వద్దంటూ వ్యాఖ్య
- మోదీపై ఒవైసీ ఘాటు ప్రశ్న
- ‘ఈ దేశం అందరిదే’ అంటూ వ్యాఖ్య

# కొండా ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్!



- వేటుపై కొనసాగుతున్న ఉత్కంఠ
- రాజగోపాల్ రెడ్డి భేటీపై చర్చ
- చర్యలపై కాంగ్రెస్‌లో హీట్
- వేటు తప్పించుకునే యత్నమా?
- మురళి కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం
- కమిటీ నిర్ణయం కోసం ఎదురుచూపు
- గాంధీ కుటుంబంపై విశ్వాసం

**న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్):** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండాసురేఖ వ్యవహారం రోజు రోజుకు ఉత్కంఠ రేపుతోంది. ఆమెపై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోబోతోందనే సస్పెన్స్ కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా సురేఖ భర్త కొండా మురళి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విడివిడిగా భేటీ అయ్యారు. ఇవాళ ప్రజాభవన్?లో భట్టిని కలిసి పార్టీలో ఇటీవల జరిగిన తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో భట్టితో పాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ నియమావళిని ఉల్లంఘించడం ఇది మూడోసారని, అలాగే చిన్నారెడ్డి సైతం లైన్ దాటి మాట్లాడారని ఇక వీరిని ఉపేక్షిస్తే పార్టీకి తీవ్రనష్టం వాటిల్లుతుందని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ (డీఏసీ) పీసీసీ చీఫ్ కు నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో కొండాపై వేటు తప్పదనే చర్చ జరుగుతున్న వేళ కొండా మురళి భట్టితే భేటీ కావడం ఆసక్తిగా మారింది.

# సీఏఏలో బిగ్ చేంజ్.. కలెక్టర్లకే పవర్స్!

- పౌరసత్వ ప్రక్రియ ఇక మరింత స్పీడ్
- కమిటీల వ్యవస్థకు కేంద్రం చెక్
- దరఖాస్తుల పరిశీలన కలెక్టర్ల చేతికి
- పౌరసత్వ సర్టిఫికెట్ మంజూరుకు కొత్త విధానం
- 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు
- అర్హతల్లో మార్పులేదన్న కేంద్రం

2 లో

# అసలైన కాంగ్రెస్ రక్తం

- భట్టితో భేటీ.. రాజగోపాల్ క్లారిటీ!
- విమర్శకులకు రాజగోపాల్ కౌంటర్!
- కాంగ్రెస్‌లో అసలైన రక్తం మాదే!
- కార్యకర్తల కోసం నా పోరాటం!
- పార్టీ బలోపేతమే నా లక్ష్యం!
- కొండా సురేఖపై అధిష్టానమే ఫైనల్!



**న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్):** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే భట్టిని కలిశానని చెప్పారు. తనపై విమర్శలు చేసేవారి గురించి తాను మాట్లాడనని తనను విమర్శిస్తున్న వారి స్థాయి ఏంటో తనను ఎందుకు విమర్శిస్తున్నారో ఓ సారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. బుధవారం ప్రజాభవన్ లో భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతల్లో తాను ఒకడినని, పార్టీ కష్టకాలంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన వాడినన్నారు.

# ప్రజల భూములపై బాంబులా?

- 22-ఏ వివాదంపై హరీశ్ రావు ఫైర్
- పొంగులేటిపై హరీశ్ ఘాటు వ్యాఖ్యలు
- ప్రజల భూములపై కుట్ర చేస్తున్నారంటూ ఆరోపణ
- 22-ఏ జాబితాపై తీవ్ర అభ్యంతరం
- యూఎల్‌సీ పేరుతో అక్రమాలంటూ విమర్శలు
- ప్రభుత్వ భూముల విక్రయాలపై ఆరోపణలు
- ప్రజల పక్షాన పోరాడుతామన్న హరీశ్

2 లో

# యువతతో మోడీ ముఖాముఖి

- ఖేలో ఇండియా’ వేదికగా కీలక సంభాషణ
- క్రీడలపై యువతకు మోదీ దిశానిర్దేశం
- 2036 ఒలింపిక్స్‌పై ప్రత్యేక ఫోకస్
- యువ ప్రతిభకు పెద్దపీట
- వికసిత్ భారత్‌లో యువ నాయకత్వం
- మత్తు రహిత యువతే లక్ష్యం

2 లో

# కొండా ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్!

మొదటి పేజీ తరువాయి

వేటు నుంచి తప్పించుకునేందుకేనా?

భట్టితో రాజగోపాల్ రెడ్డి భేటీ కావడం హాట్ డిస్కషన్ గా మారింది. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు వేస్తే అది తనపై కూడా చర్యలు తప్పవనే రాజగోపాల్ రెడ్డి అప్రమత్తమయ్యారా అనే టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారని కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాల్సి వస్తే ఆ వెంటనే రాజగోపాల్ రెడ్డిపై కూడా చర్యలకు డిమాండ్ తెరపైకి వస్తుంది. ఈ నేపథ్యంలోనే వేటు నుంచి తప్పించుకునేందుకు ముందస్తుగా రాజగోపాల్ రెడ్డి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

మేం కాంగ్రెస్‌లోనే ఉంటాం: కొండా మురళి

భటి విక్రమార్కతో భేటీ అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. మా బిడ్డ కొండా సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదన్నారు. ఆమె మనోభావాలు ఆమెకు ఉంటాయని ఆమెను ప్రశ్నించే హక్కు మాకు లేదన్నారు. మాకు గాంధీ కుటుంబంపై సంపూర్ణ విశ్వాసం ఉందని మేం కాంగ్రెస్‌లోనే కొనసాగుతామన్నారు. ఓ బిల్లు విషయంలో భట్టిని కలిశానన్నారు.కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడనన్నారు.

# బిహార్ బిగ్ ఫైట్‌లో చిన్నోడే హైలైట్!

మొదటి పేజీ తరువాయి

వచ్చే నెలలో బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్‌సీ) నిర్వహించనున్న టీచర్స్ నియామక పరీక్షలను ప్రిలిమ్స్, మెయిన్స్ అని రెండు దశల్లో కాకుండా ఒకే దశలో నిర్వహించాలని అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ సీఎం నివాసం ముట్టడికి ప్రయత్నిస్తుండగా విద్యార్థులను పోలీసులు అడ్డుకునే క్రమంలో లాఠీచార్జి చేశారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అయితే ఈ ఆందోళనలో ఓ ఆరేళ్ల బాలుడు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా మారాడు. జాతీయ జెండాను చేతిలో పట్టుకుని ఆందోళనలో పాల్గొనడం అందరి దృష్టిలో పడేట్టు చేసింది. ఈ క్రమంలో ఆ బాలుడిని పోలీసులు తమ వెంట తీసుకువెళ్తుండగా మిగతా ఆందోళన కారులు ఆరేళ్ల బాలుడిని అరెస్టు చేస్తారా అంటూ పోలీసులపై మండిడ్డారు. దీంతో ఈ బాలుడు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ గా మారాడు. ఈ క్రమంలో ఆ బాలుడి వివరాలు ఏంటనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

మొదటి తూటా నాపైనే ప్రయోగించండి:

నిరుద్యోగుల ఆందోళనలో అందరి దృష్టిని ఆకర్షించిన బాలుడి పేరు ఆదిత్య కుమార్ గా తెలిసింది. 1వ తరగతి చదువుతున్న ఆదిత్య తన తల్లిదండ్రులతో కలిసి నిరసనల్లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో ఆందోళనకారులను బస్సుల్లో పోలీసులు తరలిస్తుండగా బస్సుపైకి ఎక్కిన ఆదిత్య చేతిలో త్రివర్ణ పతాకం పట్టుకుని నినాదాలు చేశాడు. అయితే అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో ఆదిత్యతోపాటు అతడి తల్లిని పోలీసులు వాహనంలో అక్కడి నుంచి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆదిత్య స్కూల్ కు వెళ్లాల్సిన వయసులో ఆందోళనలు నీకెందుకని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వచ్చానన్నాడు. ఇప్పుడు పేపర్ లీకులు అవుతున్నాయి, నేను పెద్దయ్యాక కూడా ఇలాంటివి జరగకూడదని నేను కూడా నిరసనకు దిగానంటూ బదులిచ్చాడు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నినాదాలు డిమాండ్ చేశారు. బుల్లెట్ గాయాలకు కూడా తాను సిద్ధమేనని అవసరమైతే మొదటి తూటా నాపైనే ప్రయోగించాలంటూ ధైర్యంగా మాట్లాడాడు. లాఠీ చార్జీలకు, జైళ్లకు, బుల్లెట్లకు భయపడి వెనక్కి తగ్గేది లేదన్నాడు. విద్యార్థులపై దాడులకు ఎవరు అనుమతి ఇచ్చారో సమాధానం చెప్పాలని ఎస్పీని డిమాండ్ చేశాడు.

ఇదే తొలి ఆందోళన కాదు:

అయితే ఆదిత్యకు ఇదే తొలి నిరసన కాదని స్థానికులు చెబుతున్నారు. గతంలో విద్యార్థుల నిరాహార దీక్షల వద్దకు, ఇతర రాజకీయ నిరసనల్లోనూ కనిపించినట్లు కథనాలు చెబుతున్నారు. ఆరేళ్ల బాలుడు ధైర్యంగా మీడియా ముఖంగా మాట్లాడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో జెన్ అల్ఫా సైతం ఆందోళనల్లో పాల్గొంటోందని కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఆరేళ్ల బాలుడిని అరెస్టు చేశారంటూ వీడియోలు వైరల్ అవుతున్నా దీనిపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# సీఏఏలో బిగ్ చేంజ్.. కలెక్టర్లకే పవర్స్!




న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్): దేశంలో సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సిఏఏ) అమలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పౌరసత్వ దరఖాస్తులను పరిశీలించి, అనుమతులు జారీ చేసే అధికారాలను నేరుగా ఆయా జిల్లా కలెక్టర్లకే అప్పగించింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆగస్టు 19న విడుదల చేసిన రెండు ప్రత్యేక నోటిఫికేషన్ల ఆధారంగా ఈ నూతన విధానం అమల్లోకి వచ్చేసింది.

అయితే, గతంలో సీఏఏ కింద పౌరసత్వం పొందేందుకు జిల్లా స్థాయి, సాధికారత కమిటీల ద్వారా సుదీర్ఘమైన పరిశీలన జరిగేది. కొత్త నిబంధనల ప్రకారం ఈ కమిటీల వ్యవస్థను తొలగించి, దరఖాస్తుల పరిశీలన, పత్రాల సత్యనిరూపణ, ప్రమాణ స్వీకారం నిర్వహణ, పౌరసత్వ సర్టిఫికెట్ల మంజూరు వరకు అన్ని అధికారాలను కలెక్టర్లకే బదిలీ చేశారు. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, జమ్ముకాశ్మీర్, లడఖ్‌తో పాటు అస్సాం, త్రిపురలలోని కొన్ని నోటిఫైడ్ గిరిజన ప్రాంతాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. అర్హతల నిబంధనల్లో ఎలాంటి మార్పు లేదని, కేవలం ప్రక్రియ ఆలస్యం కాకుండా వేగవంతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కేంద్ర హోంశాఖ వర్గాలు స్పష్టం చేశాయి.

# హిజాబ్‌పై ఒవైసీ ఫైర్!

న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్): పాఠశాలలో హిజాబ్ ధరించేందుకు అనుమతి నిరాకరిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ఖండించారు. ఈ తీర్పును ఇస్లాంపై దాడిగా అభివర్ణించారు. ఇది మా మతం, ఏది అవసరమో మేమే నిర్ణయించుకుంటాం. నిర్ణయించడానికి న్యాయమూర్తులు ఎవరు? అని ప్రశ్నించారు. ఇస్లాంకు ఏది ముఖ్యమో, ఏది ముఖ్యం కాదో నిర్ణయించడం న్యాయమూర్తుల పని కాదన్నారు. స్కూల్ యూనిఫామ్‌కు అదనంగా హిజాబ్ ధరించేందుకు తనకు అనుమతి ఇచ్చేలా విద్యాసంస్థను ఆదేశించాలని కోరుతూ ప్రయాగ్‌రాజ్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్ లో చదువుతున్న ఓ విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్?ను ఈ నెల 21న జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇంద్రజీత్ శుక్లాతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. అలాగే ఇస్లాంలో మహిళలు హిజాబ్ ధరించడం తప్పనిసరైన మత ఆచారం కాదని హైకోర్టు స్పష్టం చేసింది.

రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన:

హైదరాబాద్?లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఒవైసీ.. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై స్పందించారు. ఈ తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, ఆర్టికల్ 25 కు వ్యతిరేకమని ఆరోపించారు. శబరిమల కేసుకు సంబంధించి అత్యవసర మతాచారాలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న వేళ అలహాబాద్ హైకోర్టు ఈ తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. ఈ తీర్పు వల్ల ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం బాలికల విద్య దెబ్బతింటుందని వారిని చదువుకు దూరం చేసే కుట్ర అని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు.

మోడీ వారికంటే గొప్ప దేశభక్తుడా?

వందేమాతరం వివాదంపై స్పందిస్తూ మోడీ తుర్రేబాజ్ ఖాన్, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధుల కంటే గొప్ప దేశభక్తుడా అని ప్రశ్నించాడు. భారతదేశ ప్రగతి కోసం పనిచేస్తూనే ముస్లింలు తమ విశ్వాసంలో స్థిరంగా ఉంటారని ఒవైసీ అన్నారు. ఆర్‌ఎస్ఎస్, బీజేపీపై మండిపడుతూ.. దేశభక్తి కోసం మత విశ్వాసాలను రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ దేశం అందరిదన్నారు. రాజ్యాంగ పీఠిక భారత మాత అంటూ మొదలు కాదు.. భారతదేశ ప్రజలమైన మేము అంటూ మొదలవుతుందన్నారు.

# రాజకీయాలకు గడ్కరీ గుడ్‌బై?

మొదటి పేజీ తరువాయి

పాలిటిక్స్ కు రిటైర్మెంట్ తీసుకునేందుకు ఆయన సిద్ధమయ్యారా? అంటే తాజాగా ఆయన చేసిన మాటలను బట్టి అవును అనే చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. త్వరలో కేంద్ర కేబినెట్?లో మార్పులు చేర్పులు ఉండబోతున్నాయన్న ఊహాగానాలు మధ్య నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి.

కొత్తవారికి బాధ్యతలు:

తాజాగా మహారాష్ట్రలోని నాగ్ పూర్ లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. 'నేను చేయాలనుకున్నంత కాలం పని చేశాను. తాను గతంలోలా ఎక్కువగా పనిచేయలేకపోతున్నాను. ప్రజా పనుల్లో ప్రమేయం తగ్గిపోయింది. ఆ పనిని కొత్త తరాలకు అప్పగించాలి. కొత్త వారికి సీనియర్లు మార్గనిర్దేశం చేయాలి. గత 30 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. ప్రశంసలు అందుకున్నాను' అని గుర్తు చేశారు. నితిన్ గడ్కరీ చేసిన ఈ వ్యాఖఅయలు రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ధర్మేంద్ర ప్రదాన్ తర్వాత టార్గెట్ గా గడ్కరీ:

ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా తర్వాత సోషల్ మీడియాలో నితిన్ గడ్కరీ టార్గెట్ గా మారారు. ఈ-20 పెట్రోల్ విషయంలో నెటిజన్లు ఆయనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా తనకు సంబంధం లేని పెట్రోలియం శాఖకు సంబంధించిన విషయంలో నితిన్ గడ్కరీ తరచూ ఎందుకంతా ఇంపార్టెంట్ చూపిస్తున్నారు? తన కుమారులకు ఇథనాల్ వ్యాపారం ఉంది కాబట్టే ఈ-20కి అనుకూలంగా మాట్లాడుతున్నారంటూ కామెంట్ల రూపంలో నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఇదిలా ఉంటే త్వరలో జరగబోయే మార్పులు కేబినెట్ మార్పుల్లో నితిన్ గడ్కరీ విషయంలో బిగ్ డిసిషన్ ఉండబోతోందా అందులో భాగంగానే గడ్కరీ ఈ తరహా వ్యాఖ్యలు చేశారా అనే వాదనలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ విషయంలో ప్రధాని మోడీ, అమిత్ షా ఇప్పటికే అన్ని సమీకరణాలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక మహారాష్ట్ర రాజకీయం సైతం ఆసక్తిగా మారింది. ఇక్కడ బీజ్జేపీ, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారికి మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల శరద్ పవార్ సైతం ప్రధాని మోడీని కలవడం హాట్ టాపిక్ అయింది. ఈ క్రమంలో నితిన్ గడ్కరీ కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాలన్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారి తీసింది.

స్పందించిన మంత్రి కార్యాలయం:

అయితే నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు పెద్ద ఎత్తున డిస్కషన్ జరుగుతున్న నేపథ్యంలో మంత్రి కార్యాలయం స్పందించింది. మంత్రి వ్యాఖ్యలకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చింది. గడ్కరీ మాట్లాడింది లక్ష్మణ్ రావు మన్కర్ ట్రస్ట్ గురించి అని దాని ఏర్పాటు చేసింది ఆయనేనని పేర్కొంది. ఈ ట్రస్ట్ కింద ఆదివాసీ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నడుస్తున్నాయని మునుపటిలా ఆ ట్రస్టు బాధ్యతలు తాను నిర్వహించలేనని యువతరానికి అవకాశం ఇవ్వాలని మాత్రమే అన్నారని పేర్కొన్నారు. కానీ మంత్రి వ్యాఖ్యలను మీడియా రాజకీయాలకు ముడిపెట్టిందని వివరణ ఇచ్చారు. మంత్రి కార్యాలయం చెప్పినట్లు ఇది కేవలం ట్రస్ట్ వరకే పరిమితం అవుతందా లేక త్వరలో జరగబోయే కేబినెట్ విస్తరణలో బిగ్ బ్లాస్ట్ ఏదైనా ఉండబోతోందా అనేది కాలమే నిర్ణయించనుంది.

# యువతతో మోడీ ముఖాముఖి




న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్): దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది దిశగా యువత క్రీడారంగంలోకి అడుగుపెట్టేలా ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమంలో పాల్గొని యువతతో వర్చువల్‌గా సంభాషించనున్నారు. దేశ క్రీడా ప్రస్థానం, యువత ఆకాంక్షలు, 'వికసిత్ భారత్' నిర్మాణంలో యువ నాయకత్వాన్ని భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధాని మోడీ ప్రసంగం ప్రధానంగా క్రీడలు, ఒలింపిక్ ఆకాంక్షలు, యువ నాయకత్వం, వికసిత్ భారత్, 'నశా ముక్త్ యువ' (మత్తు రహిత యువత) అనే ఐదు కీలక ఇతివృత్తాల చుట్టూ సాగనుంది.

భారత క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, అత్యున్నత స్థాయి కోచింగ్ ప్రమాణాలు, అందరికీ సమాన భాగస్వామ్యం కల్పించడంతో పాటు 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా నూతన ప్రతిభను వెలికి తీయడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. శాస్త్రీయ పద్ధతిలో క్రీడాకారుల ప్రతిభను గుర్తించడం, పారదర్శక ఎంపిక విధానం, క్రీడాకారుల దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంపై ఈ చర్చాగోష్ఠి లో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. క్రీడల ద్వారా సాధికారత సాధించి దేశాన్ని గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా నిలపడానికి ఇది ఎంతో దోహదపడనుందని అధికార వర్గాలు తెలిపాయి.

# తిరుపతిలో కూలిన భవనం!

మొదటి పేజీ తరువాయి

ప్రమాద స్థలంలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. మరికొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఘటన జరిగిన వెంటనే స్థానికులు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో రెస్క్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపడుతున్నారు. శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవలే గచ్చిభౌలిలో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్థుల భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. తక్కువ స్థలంలో అక్రమంగా నిర్మించడంవల్లే భవనం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించారు. ఈ ఘటన మర్చిపోకముందే తిరుపతిలో నాలుగు అంతస్తుల భవనం కూలిపోవడం షాకింగ్ గా మారింది.

# అసలైన కాంగ్రెస్ రక్తం

మొదటి పేజీ తరువాయి

2018 ఎన్నికల్లో పెద్ద పెద్ద లీడర్లు ఓటమి పాలైనా మునుగోడు ప్రజలు మాత్రం తనను గెలిపించారన్నారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూసిన కేసీఆర్?కు వ్యతిరేకంగా సర్వస్వం ధారపోసి కొట్లాడిన వ్యక్తిని నేనని అలాంటి నాపై మాట్లాడే వారు ఓ సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. రాజగోపాల్ రెడ్డి అనునిత్యం తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి అని అవినీతికి వ్యతిరేకంగా పని చేసే వ్యక్తి అన్నారు.

నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగొద్దు:

తెలగాణ గురించి తాను ఎంతగానో పోరాడానని నేను పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. అలాగే వ్యక్తిగతంగా సీఎంను గానీ ఇతర నాయకులెవరినీ విమర్శించలేదన్నారు. ఎన్నికలప్పుడు పార్టీలోకి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడం, వారు గెలిచిన తర్వాత నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరుగుతోందని వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీపైన, అధిష్టానంపైన ఉందని చెప్పానన్నారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నానన్నారు. నేను ఏదైనా మాట్లాడితే రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తన లక్ష్యం అన్నారు. పార్టీ బలోపేతం కోసమే మాట్లాడుతాను తప్ప పార్టీని బలహీన పరిచేలా ఎప్పుడూ మాట్లాడనన్నారు. తెలంగాణలో నిజమైన, నిజాయితీపరులైన ఉద్యమాకారులు ఎంతో మంది ఉన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు ఉన్నత స్థాయి పదవుల్లో ఉండవచ్చు. అంత మాత్రాన నిజాయితీగా ఉద్యమంలో పోరాడిన వ్యక్తులను కించపరిచేలా కథనాలు రాయవద్దని హెచ్చరించారు. మాది అసలైన కాంగ్రెస్ రక్తం అన్నారు.

కొండా సురేఖపై అధిష్టానం నిర్ణయమే ఫైనల్:

కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై రాజగోపాల్ రెడ్డి స్పందించారు. వీరి విషయంలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా చెప్పారని ఈ అంశంలో సీఎం మాటే నామాట అన్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ ఉందని కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై లోతైన అధ్యయనం చేసి పీసీసీ కి నివేదిక ఇచ్చారు. అధిష్టానం నిర్ణయాన్ని ఎవరూ కాదనలేమన్నారు.

# ప్రజల భూములపై బాంబులా?




న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ భూములున్నా వెంటనే అమ్మేస్తోందని గడిచిన రెండున్నరేళ్లలో రూ. 30 వేల కోట్ల విలువైన భూములు విక్రయించారని మాజీ ఎంపీ హరీశ్ రావు విమర్శించారు. ప్రజల నుంచి భూములు సేకరించి తన అనుచరులకు కట్టబెడుతున్నారని ఇప్పుడు ప్రజల భూములను కూడా 22ఏ లో చేర్చి ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్ కూకట్ పల్లిలో 22ఏ నిషేధిత భూముల బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. యూఎల్సి (అర్బన్ ల్యాండ్ సీలింగ్) చట్టం పేరిట రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భారీ కుట్రకు తెర లేపుతున్నారని ఇది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం అన్నారు. 2008లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉనప్పుడు యూఎల్?సీ చట్టం రద్దు చేసిందని తర్వాత ప్రభుత్వం అన్ని అనుమతులు ఇస్తే ప్రజలు ప్లాట్లు కొనుక్కుని ఇండ్లు కట్టుకున్నారన్నారు. కానీ రేవంత్ రెడ్డి 2008 కంటే ముందు మీ భూమి యూఎల్?సీలో ఉందని నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు.

పొంగులేటి నీ బాంబులు ఇవేనా?

గతంలో దీపావళి సందర్భంగా ప్రతిపక్షాలపై బాంబులు వేస్తానన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రతిపక్షాలకు బదులు ప్రజలపై 22ఏ బాంబు వేశారని.. పొంగులేటి నీ బాంబులు ఇవేనా? అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, పొంగులేటికి రియల్ ఎస్టేట్ తెలిసి ఉండొచ్చు.. కానీ బీఆర్ఎస్ నాయకులకు ఉద్యమాలు, పోరాటాలు తెలుసన్నారు. అవసరమైతే ప్రభుత్వం మెడలు వంచి ప్రజల పక్షాన నిలబడటం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి మొదట ఎచ్సియూలోని 400 ఎకరాల భూముల్ని అమ్మకానికి పెట్టారని అది కుదరకపోవడం వల్ల బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని ఆరోపించారు. అలాగే మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని 9 వేల ఎకరాల భూముల్ని అదే బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని ఇలా రేవంత్ రెడ్డి ప్రజల భూములతో పాటు ప్రభుత్వ, కాలేజీ, యూనివర్సిటీ భూములను వదిలిపెట్టడం లేదన్నారు. సామాన్యుల భూములను 22ఏ లో పెట్టి వేధిస్తూ సీఎం బంధువులకు మాత్రం విలువైన ప్రభుత్వ ఆస్తులు దారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు.

# పేపర్ లీక్ ఎఫెక్ట్.. ఎగ్జామ్ క్యాన్సిల్!




న్యూస్ డెస్క్, 26 ఆగస్టు (బిఎన్ఎస్): మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో గ్రూప్-బి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన నియామక ప్రక్రియను రద్దు చేస్తూ మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 2026 మార్చి 22న నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలో అక్రమాలు, మాల్‌ప్రాక్టీస్ జరిగాయంటూ పలువురు అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల నుంచి కమిషన్‌కు ఈ-మెయిళ్ల ద్వారా తీవ్ర ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ చేపట్టిన ఎంపీఎస్సీ, పరీక్ష పారదర్శకతను కాపాడే క్రమంలో మొత్తం రిక్రూట్‌మెంట్ ప్రక్రియనే రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

పరీక్ష ప్రారంభానికి ముందే, మార్చి 20వ తేదీ నాటికే కొందరు అభ్యర్థులకు ప్రశ్నపత్రం, కీలక ప్రశ్నలు చేరిపోయాయని, అవి సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా సర్క్యులేట్ అయ్యాయని అభ్యర్థులు కమిషన్ దృష్టికి తెచ్చారు. ఈ ఆరోపణలపై జరిపిన ప్రాథమిక విచారణలో అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో నియామక ప్రక్రియను రద్దు చేసినట్లు కమిషన్ స్పష్టం చేసింది. భవిష్యత్తులో అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తదుపరి చర్యలు చేపడతామని ఎంపీఎస్సీ వెల్లడించింది.

# తెలంగాణ ప్రాజెక్టులపై జగన్ ఆగ్రహం!

మొదటి పేజీ తరువాయి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత, మధ్యలో జులై 10న పంటలకు నీళ్లిస్తామని మంత్రులు ప్రకాశం బ్యారేజీ లాకుల దగ్గర ఫోజులిచ్చి ఫోటోలు దిగి పబ్లిసిటీ స్టంట్‌లు చేశారని ఎద్దేవా చేశారు. వీళ్లను నమ్మి, నీళ్లిస్తారని కృష్ణాడెల్టా రైతులతో పాటుగా మిగిలిన ప్రాంతాల్లోని రైతులు అప్పులు చేసి, పెట్టుబడి పెట్టి, అష్టకష్టాలు పడి విత్తనాలు, ఎరువులు కొని, నార్లు వేశారన్నారు. ఇప్పుడు పొలాల్లో నార్లు ఎండిపోయాయని.. రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని.. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి నీళ్లు ఇచ్చే విషయంలో ఆయన తీరు దుర్మార్గంగా ఉందన్నారు.

శ్రీశైలం రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులుగా ఉంటే.. ఈ ఆగస్టులోనే 879.50 అడుగులకు నీళ్లు వచ్చినా సరే పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వడానికి మనసు రాలేదన్నారు జగన్. నాగార్జునసాగర్ కింద ప్రాంతాల్లోని వ్యవసాయం పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్ కింద పులిచింతల దగ్గర రెండు లిఫ్టులు అక్రమంగా లిఫ్టులు పెట్టి, పంపుహౌస్‌లు కడుతున్నా చంద్రబాబు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు జగన్. తెలంగాణలోని చింతలపాలెం మండలం పాత వెల్లటూరు దగ్గర మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం పంప్ హౌజ్ పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి 8 టీఎంసీలు తరలించడానికి రూ.1,450 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టారన్నారు. తెలంగాణలోనే చింతలపాలెం మండలం బుగ్గమాదారం దగ్గర పులిచింతల ప్రాజెక్టు దిగువన రాజీవ్ ఎత్తిపోతల పథకం పనులు చేస్తున్నారన్నారు. రూ.394 కోట్లతో కృష్ణా నది నుంచి 2.5 టీఎంసీలు తరలించడానికి ఈ ప్రాజెక్టును చేపట్టారని జగన్ ఆరోపించారు.

మరి నవీన్‌కు ఎందుకు కాల్ లెటర్ పంపలేదు.. వైఎస్ జగన్ సూటి ప్రశ్న

చంద్రబాబు రైతులకు ఆర్థికంగా రక్షణగా ఉండే వైఎస్సార్ ఉచిత పంటల బీమాను రద్దుచేసి, రైతులకు తీవ్ర అన్యాయం చేశారని జగన్ ఆరోపించారు. రైతులే ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి వస్తోందని.. 2022-23లో ఖరీఫ్ సీజన్‌లో 1.18 కోట్ల దరఖాస్తులకు ఉచిత బీమా వర్తిస్తే.. 2026-27 ఖరీఫ్‌లో కేవలం 35.17 లక్షల దరఖాస్తులు మాత్రమే పంటలబీమా కిందకు వచ్చాయన్నారు. జులైలో ఉచిత పంటలబీమాకు సంబంధించి కట్టాల్సిన ప్రీమియంను చంద్రబాబు కట్టకుండా వదిలేశారని ఆరోపించారు. దీంతో రైతులకు అందాల్సిన దాదాపు రూ.3వేల కోట్లు రైతులకు రాకుండా పోయాయన్నారు. రాష్ట్రంలో పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కూడా లేవన్నారు. రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు.

చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ తమపై తప్పుడు ప్రచారాలు, అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు జగన్. కానీ కరువు సమయంలో రైతుల్ని, ప్రజల్ని ఎలా ఆదుకుంటారో మాత్రం చెప్పడం లేదని.. ఈ అంశంపై ముందస్తు ప్రణాళిక కూడా లేదన్నారు. వ్యవసాయరంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కూలీలకు అదనంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని.. పేదలు ఆహార భద్రతను కల్పించాలన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం డైవర్షన్, రెడ్‌బుక్ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని విమర్శించారు. ఇలాంటి కరువు పరిస్థితుల్లో ప్రజలు, రైతుల్ని ఆదుకోవడానికి ప్రభుత్వం దగ్గర ఎలాంటి ప్రణాళిక ఉందో చెప్పాలని డిమాడ్ చేశఆరు జగన్. ఈ అంశాలపై చంద్రబాబు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

# పశ్చిమ బెంగాల్ తీరంలో ఏడుగురు మత్స్యకారులు సురక్షితం

## మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



అమలాపురం, (బిఎన్ఎస్) ఆగస్టు 26: 2026 కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. మత్స్యకారుల క్షేమ సమాచారం తెలియడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు నుంచి సముద్ర వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటులో సాంకేతిక సమస్య తలెత్తడంతో పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ కోసం జిల్లా యంత్రాంగం, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టగా, వారు అక్కడ క్షేమంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు.

బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో అధికారులు మాట్లాడి మత్స్యకారుల వివరాలను నిర్ధారించినట్లు తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన సమన్వయ చర్యలతో వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకోగలిగామని కలెక్టర్ పేర్కొన్నారు.

మత్స్యకారులను పశ్చిమ బెంగాల్ నుంచి స్వస్థలానికి సురక్షితంగా తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు.

మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మత్స్యకారులు స్వస్థలానికి చేరుకునే వరకు అవసరమైన అన్ని చర్యలను పర్యవేక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# మన భారతదేశం మతసామరస్యానికి ప్రతీక.

## మహమ్మద్ ప్రవక్త సల్లేవుల్లాహు వసల్లం అడుగుజాడల్లో నడవాలి.
## మాజీ రాష్ట్ర డిప్యూటీ సీఎం మరియు కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి.అంజాద్ భాష..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 26:

కడప నగరంలో మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఇనాత్ ఖాన్ తాలిం నుండి ప్రారంభమై ఆగాడి, మోచంపేట, మట్టి పెద్దపులి, చెన్నూరు బస్టాండ్, 1వ గాంధీ బొమ్మ సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, 7 రోడ్ల మీదుగా, ఎన్టీఆర్ కూడలి వరకు పెద్ద ఎత్తున ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా తో మత పెద్దలు, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

మన భారతదేశం మతసామరస్యానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరు మహమ్మద్ ప్రవక్త సల్లేవుల్లాహు వసల్లం అడుగుజాడల్లో నడవాలని మాజీ డిప్యూటీ సీఎం ఎస్. బి.అంజాద్ భాష అన్నారు.

ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాష మాట్లాడుతూ.. మన ప్రియతమ ప్రవక్త మహమ్మద్ సల్లేవుల్లాహు వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా కూడా ముస్లిం సోదర సోదరీమణులున్నారో వారందరూ ఘనంగా ఆయన జన్మదినోత్సవాన్ని "మీలాద్ ఉన్ నబీ" పేరుతో పండుగను జరుపుకోవడం జరుగుతోందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉండే ప్రజలందరికీ, కడప నియోజకవర్గ ప్రజలందరికీ ముస్లిం సోదర సోదరీమణులందరికీ "మీలాద్ ఉన్ నబీ" శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. మహమ్మద్ ప్రవక్త సల్లేవుల్లాహు వసల్లం అల్లా పంపిన చివరి ప్రవక్తగా పంపడం జరిగిందని అన్నారు. ఆ ప్రవక్త కేవలం ముస్లింలకే కాకుండా యావత్తు మానవాళికి ప్రవక్తగా పంపడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఆయన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఒక మనిషి జీవన శైలిని భూమిపై సన్మార్గంలో కోనసాగించాలని చెప్పి పూర్తిగా ఆయన తెలియపరచడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఆయన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ రాష్ట్ర ప్రజలు, బడుగు బలహీన వర్గాల ప్రజలందరూ, రైతులు సుఖ శాంతులతో సుభిక్షంగా ప్రతి ఒక్కరు కూడా ఉండాలని ఆ దేవున్ని ప్రార్థించడం జరిగిందని చెప్పారు. ఈ ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా తో మత పెద్దలు, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.



# ఆధార్ సేవలను వేగవంతం చేయాలి

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 26:

జిల్లాలో ఆధార్ నమోదు, వివరాల నవీకరణ ప్రక్రియలను మరింత వేగవంతం చేసి పెండింగ్‌ను తగ్గించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ

డిఎల్ఏఎంసి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్ గా హైదరాబాద్ ఆధార్ రీజనల్ కార్యాలయం నుండి అసిస్టెంట్ మేనేజర్ జావీద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ముఖ్యంగా 0-5 ఏళ్ల చిన్నారుల ఆధార్ నమోదు, 5-15 ఏళ్లు, 15 ఏళ్లు పైబడిన వారి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులందరికీ ఆధార్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 206 ఆధార్ కిట్లు పనిచేస్తుండగా, గత 30 రోజుల్లో 29,299 నమోదు, నవీకరణ లావాదేవీలు నమోదైనట్లు తెలిపారు. ప్రతి మండలాన్ని కవర్ చేసేలా క్రియాశీల ఆధార్ కేంద్రాలను అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు కిట్లు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 5-15 ఏళ్ల వారికి 37,627, పదిహేనేళ్ళ పైబడిన వారికి 21,865 నమోదులకు కలిపి మొత్తం 59,492 తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణలు పెండింగ్‌లో ఉన్నాయని రికార్డుల ద్వారా తెలుస్తోందన్నారు. అయితే.. ఈ పెండింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు పాఠశాలలు, అంగన్‌వాడీలను కేంద్రాలుగా చేసుకుని శిబిరాలు నిర్వహించాలని, నవీకరణ చేయించుకోని వారిని సచివాలయాల ద్వారా గుర్తించి సమీప ఆధార్ కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, తపాలా శాఖ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని మొబైల్ పరికరాల ద్వారా ఇంటింటికీ లేదా శిబిరాల ద్వారా మొబైల్ ఆధార్ నవీకరణ సేవలను విస్తరించాలని సూచించారు. ఆధార్ నవీకరణకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొన్నారు.

ఆధార్ నమోదు, నవీకరణలో తప్పుడు లేదా ద్వంద్వ ధ్రువపత్రాల వినియోగాన్ని అరికట్టేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ద్వంద్వ జనన ధ్రువపత్రాలు, ద్వంద్వ పదో తరగతి మార్కుల జాబితాలు, గడువు తర్వాత జారీ చేస్తున్న మాన్యువల్ నివాస ధ్రువపత్రాల అంశాలపై సమగ్ర పరిశీలన, ధ్రువీకరణ చేపట్టాలని సూచించారు. ప్రజల్లో ఆధార్ నవీకరణపై అవగాహన పెంచేందుకు జిల్లా అధికారిక సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించాలని, ఆధార్ నవీకరణ అవసరమైన వారంతా సమీప కేంద్రాలు, ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్జీ ఎస్డిఓ డి. ప్రతాప్ రెడ్డి, సిఎస్‌సి డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్. సుబ్రమణ్యం, ఐసిడిఎస్ పిడి పి. రామాదేవి, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ జి. రాజేష్, విద్యా శాఖ డిఈఓ, ఎస్ఈ డా. షేక్ షంషుద్దీన్, డిఎంహెచ్ఓ డిఐఓ ఇన్‌చార్జ్ డా. జె. ప్రవీణ్ కుమార్, లీడ్ బ్యాంక్ ఎల్‌డిఎం ఇంచార్జి ఏ. శ్రీ పుష్పవాణి, పోలీసు ఇన్‌స్పెక్టర్ జి. ఇదుర్ బాషా సంబందిత కమిటీ అధికారులు పాల్గొన్నారు.

# తొలి గడప కడపలో ఆగమశాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ జీర్ణోద్ధారణ..

## అష్టబంధన మహాసంప్రోక్షణశాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి, మహాసంప్రోక్షణ.
## మహాసంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభం



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్ట్ 26:

దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జీర్ణోద్ధారణ, అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాలు బుధవారం ఆగమశాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొన్నారు. జీర్ణోద్ధారణ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 7 గంటలకు చతుస్థానార్చన, మూర్తి హోమం, ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 9.45 నుంచి 11.30 గంటల వరకు శ్రవణా నక్షత్రం, తులాలగ్నంలో మహా పూర్ణాహుతి, మహాసంప్రోక్షణ, కళాకర్షణ కార్యక్రమాలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన మహాసంప్రోక్షణ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయానికి పూర్వ వైభవం, పవిత్రత మరింతగా చేకూరాలని ప్రార్థించారు. మహాసంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభమైంది.

### ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారిని దర్శించుకున్న టీటీడీ ఈవో

అంతకుముందు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఈవోకు అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ కోదండరామస్వామివారి ఆలయ విశిష్టత, చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని ఈవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డెప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, ఏఈవో రవి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి




జన్నారం, బిఎన్ఎస్: గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన పోషన్న, నరసవ్వ దంపతుల కుమారుడు మనోహర్ (24) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం గుండెపోటుతో మనోహర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోషన్న నరసవ్వ దంపతులకు పిల్లలు లేకపోవడంతో మనోహర్‌ను దత్తత తీసుకున్నారు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతూ చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో మనోహర్ హఠాన్మరణంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

# ఆటో బోల్తా ప్రమాదంలో గాయపడిన అంగన్‌వాడీ టీచర్లను పలకరించిన ఎమ్మెల్యే వేగుళ్ల.....



మండపేట (బిఎన్ఎస్ )ఆగస్టు 26 : ఇటీవల జొన్నాడ వద్ద జరిగిన ఆటో బోల్తా ప్రమాదంలో గాయపడిన అంగన్‌వాడీ టీచర్లను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పలకరించారు. బాధితులైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు మెట్టి సుజాత, రంకిరెడ్డి నాగలక్ష్మి, వెన్నెటి జ్యోతి, పితాని రుతువమ్మ, కాశి మేరి, కుప్పాల పద్మలను ఎమ్మెల్యే నేరుగా కలసి వారిని పలకరించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పెంచలకోనలో 28న శ్రావణ పౌర్ణమి వేడుకలు



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్ ):- ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ పెనుశీల లక్ష్మీ నరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు నెల 28న శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారికి విశేష అభిషేకం, చందనాలంకార సేవ, సామూహిక లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చనలతో పాటు తిరుమాడ వీధుల్లో బంగారు గరుడ సేవ క్షేత్రోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సింధూ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నారు.

# అడసనపల్లి వారి గంధపు నలుగులో పాల్గొన్న టిడిపి నేత టిఎన్. ప్రసాద్ నాయుడు



నెల్లూరు జిల్లా సైదాపురం(బిఎన్ఎస్ ):- నెల్లూరు జిల్లాలోని సైదాపురం మండలం కృష్ణారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అడసనపల్లి వెంకటరమణయ్య, పెంచలమ్మ దంపతుల కుమారుడు అడసనపల్లి వెంకటేశ్వర్లు 'నలుగు' కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి మరియు క్లస్టర్-4 ఇన్‌చార్జ్ తిక్కమ్మనేని ప్రసాద్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.?ఈ సందర్భంగా ప్రసాద్ నాయుడు పెళ్లి కుమారుడు వెంకటేశ్వర్లుకు నలుగు పెట్టి, పట్టువస్త్రాలు అందించి, వేద మంత్రోచ్ఛారణల నడుమ భావి జీవితం సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆశీర్వదించారు.అనంతరం కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శానాయపాలెం బూత్ కన్వీనర్ గుండపనేని సుధాకర్ నాయుడు, కంబాలపల్లి బూత్ కన్వీనర్ బక్క శంకర్, స్థానిక నాయకులు అడసనపల్లి వెంకట రమణయ్య, శ్రీనులతో పాటు కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాంపల్లె చెరువులో శ్రీ వెంగమాంబ నూతన ఆలయానికి భూమిపూజ



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 26:

శ్రీ వెంగమాంబ నూతన ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక కృషి అభినందనీయం అన్న వాంపల్లె చెరువు గ్రామ ప్రజలు. బి. మఠం మండలం, రేకలకుంట పంచాయతీ, వాంపల్లె చెరువు గ్రామంలో టీటీడీ నిధులతో సుమారు 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ వెంగమాంబ నూతన ఆలయానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాన్ని గుర్తించి, ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగానే నేడు ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఎమ్మెల్యే పుట్టా ఆశీస్సులతో, బి. మఠం మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా టీడీపీ కడప జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి, బి. మఠం మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్ సేవలకు ఇది మరో నిదర్శనం అని వాంపల్లె ప్రజలు పేర్కొన్నారు..

# గోపాల కిషన్ కుటుంబానికి ఆర్థిక సాయం



**స్టేషన్ ఘనపూర్/ బిఎన్ఎస్,ఆగస్టు 26:**

స్టేషన్ ఘనపూర్ మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన కందుకూరి గోపాలకిషన్ ఇటీవల రైలు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారీ పడిపోయి మరణించారు. కందుకూరి గోపాల కిషన్ అయ్యప్ప మాల ధరించేవారు. మణికంఠ సేవా సొసైటీ సభ్యులు తమ తోటి అయ్యప్ప మాల దారులు గోపాలకిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గోపాలకిషన్ లేకపోవడం వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు.తమ తోటి మాలాదారుని కుటుంబానికి మేము అండగా ఉంటామని ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మణికంఠ సేవా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాజంపేటలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సమిష్టి కృషి.

**• టీడీపీ ఇంచార్జితో డాక్టర్ మారుతి మర్యాద పూర్వక భేటీ**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 26:

రాజంపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జగన్మోహన్ రాజును ప్రముఖ వైద్యుడు డాక్టర్ మారుతి రాజంపేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, రానున్న మున్సిపల్ ఎన్నికలు తదితర అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం.

పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయించినా, వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

**ప్రజలకు చేరువవుతున్న డాక్టర్ మారుతి.**

డాక్టర్ మారుతి ఇటీవల రాజంపేట ప్రాంతంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మరింత చేరువవుతున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలపై ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. వైద్య రంగంలో తన సేవలతో పాటు ప్రజా సమస్యలపై స్పందిస్తూ స్థానికంగా తన పరిచయాలను విస్తరించుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**మున్సిపల్ ఎన్నికలపై ఆసక్తి**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాజంపేట చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయాలనే ఆసక్తిని డాక్టర్ మారుతి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆయన జరుపుతున్న సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈరోజు శాన్వి స్కూల్ అధినేత ప్రముఖ న్యాయవాది శరత్ తో పాటు మరి కొందరి ప్రముఖులను కలిశారు. అయితే పార్టీ అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రజా సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్న డాక్టర్ మారుతి, మరోవైపు పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటుండటం రాజంపేట రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా పార్టీ నిర్ణయమే శిరోధార్యమని, అభ్యర్థి విజయానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఈ భేటీ ద్వారా వ్యక్తిగత రాజకీయ ఆశయాల కంటే పార్టీ బలోపేతం, సమన్వయం, రానున్న ఎన్నికల్లో విజయమే ప్రధాన లక్ష్యంగా నాయకులు ముందుకు సాగుతున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజంపేటలో టీడీపీ రాజకీయ సమీకరణాలు ఏ విధంగా మారతాయన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు టి. లక్ష్మీనారాయణ గుణకల చిన్న, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు




కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సింగరేణి అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు.

ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారాన్ని తీసుకుంటామని ఆయన చెప్పారు. దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా బొగ్గు నుంచి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని ఆయన చెప్పారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి ఇకపై బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లోకి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

తెలంగాణకు గుండెకాయలాంటి ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**దేవదుర్గపై ప్రత్యేక దృష్టి:**

దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అన్వేషణకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఉప ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారుల బృందంతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నారు. ఖనిజ అన్వేషణ వేగవంతానికి అవసరమైన సహకారంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు దేవదుర్గ బ్లాక్‌ను ఒక కీలక అవకాశంగా మలచాలని అధికారులకు సూచించారు.

**అన్ని ఖనిజ వేలాల్లో పాల్గొనాలి:**

దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ సింగరేణి తన కార్యకలాపాలను విస్తరించాలని భట్టి విక్రమార్క సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, సింగరేణికి అనుకూలమైన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. సింగరేణి ఇకపై కేవలం బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల మైనింగ్‌లోనూ తనదైన ముద్ర వేయాలని పేర్కొన్నారు. త్వరలో వనాడియం, టైటానియం వంటి కీలక ఖనిజ బ్లాక్‌లు వేలానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా ఇంధన, పారిశ్రామిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణి అడుగులు వేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఈ ఖనిజాలకు పెరగనున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త అవకాశాలను గుర్తించాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఖనిజ అవకాశాలను అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లోని అవకాశాల పరిశీలనకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అందుబాటులోకి వచ్చే అవకాశాలను పరిశీలించి సింగరేణికి ప్రయోజనకరమైన ప్రాజెక్టులపై ముందడుగు వేయాలని సూచించారు.

**డిమాండ్‌కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి:**

ఒకవైపు కీలక ఖనిజాల రంగంలో విస్తరిస్తూనే మరోవైపు సంస్థ ప్రధాన కార్యకలాపమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, ఇంధన భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని, ఈ విషయంలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో అనుభవాన్ని ఉపయోగించుకుంటూనే, కీలక ఖనిజాల రంగంలోనూ సింగరేణిని దేశంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# అంబేద్కర్‌పై అసత్య ప్రచారాలకు ‘అంబేద్కర్ సూర్యుడు’ పుస్తకమే సరైన సమాధానం

**• బహుజనసేన ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చందు**



బిఎన్ఎస్, ఆంధ్రప్రదేశ్ : భారతరత్న, ప్రపంచ నాయకుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై కొందరు పదే పదే అసత్య ఆరోపణలు చేయడం, ఆయన చరిత్రను వక్రీకరిస్తూ వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని బహుజనసేన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చందు పేర్కొన్నారు. డాక్టర్ అంబేద్కర్ విప్లవాత్మక ఆలోచనలు, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పోషించిన చారిత్రాత్మక పాత్రను తక్కువ చేసి చూపించే కుట్రలను ప్రజలు తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ పై వచ్చే ఇటువంటి దుష్ప్రచారాలకు, వక్రీకరించిన రాతలకు గతంలోనే ప్రముఖ రచయిత కేజీ సత్యమూర్తి (శివసాగర్) రచించిన “అంబేద్కర్ సూర్యుడు” పుస్తకం స్పష్టమైన సమాధానం ఇచ్చిందని శ్రీ చందు గుర్తుచేశారు. మహనీయుల జీవిత విశేషాలను, సిద్ధాంతాలను తెలుసుకోవాలంటే వాస్తవాల ఆధారంగా చరిత్రను అధ్యయనం చేయాలని, అంతేకానీ దురుద్దేశపూర్వక ప్రచారాలను నమ్మకూడదని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనా వారసత్వాన్ని, బహుజన తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడానికి ‘అంబేద్కర్ సూర్యుడు’ ఒక ముఖ్యమైన దిక్సూచిలా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ ఆశయాలైన సమత, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలను సమాజంలోకి బలంగా తీసుకెళ్లడమే ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

# అంబేద్కర్ విగ్రహ స్థాపనకు సిద్ధపూర్ గ్రామస్తుల ఐక్యత

**• విద్యే ఆయుధం • మద్యపానానికి దూరంగా ఉండాలి • దళిత రత్న అయ్యాల సంతోష్**



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, ఆగస్టు 26: పిట్లం మండలంలోని సిద్ధపూర్ గ్రామంలో భారత రత్న, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ స్థాపన కోసం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విగ్రహ స్థాపనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామస్తులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సామాజిక కార్యకర్త, దళిత రత్న అయ్యాల సంతోష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు విద్యే ప్రధాన ఆయుధమని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని అన్నారు. మద్యపానాన్ని పూర్తిగా నిషేధించి, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహ స్థాపనకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు అయ్యాల సంతోష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత దావులయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పోచయ్య, సంజీవులు, బస్వారాజు, అనిల్, లక్ష్మణ్, రమేష్, నర్సింలు, రాములు, సామియెల్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం నాడు మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు.

సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# పగలు పెయింటర్.. రాత్రి దొంగ.!!

**గజ దొంగను అరెస్ట్ చేసిన వీరబల్లి పోలీసులు.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 26: కడప,అన్నమయ్య, కర్నూలు జిల్లాల్లో 15 చోరీలకు పాల్పడిన గజ దొంగ షేక్ నౌమాన్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. షేక్ నౌమాన్ వద్ద నుండి. 84.76 గ్రాముల బంగారం, ఎటిఎం బైక్ స్వాధీనం చేసుకున్నారు. పగటి పూట ఫెయింటర్ గా పనిచేస్తూ.. రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్న అంతర జిల్లాల గజ దొంగను కడప జిల్లా వీరబల్లి పోలీసులు అరెస్టు చేశారు. కడప, అన్నమయ్య, కర్నూల్ జిల్లాలలో వరస చోరీలకు పాల్పడుతున్న ఘరాన దొంగను కడపజిల్లా వీరబల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 84.76 గ్రాముల బంగారు నగలు, ఎటియం, బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కడపజిల్లా సుండుపల్లి మండలం, జీకే రాచపల్లెకు చెందిన షేక్ నౌమాన్ అలియాస్ మస్తాన్ గా పోలీసులు గుర్తించారు. కడపజిల్లా వీరబల్లి పోలీస్ స్టేషన్ లో సుండుపల్లి సీఐ సురేష్ రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు. నిందితుడు ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతాలను కేంద్రాలుగా ఎంచుకుని వరస దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. నిందితుడు ఆగస్టు 10 వ తేదీన వీరబల్లి మండలం, వంగిమళ్ళ గ్రామం, దుగనపల్లెలో మల్లూరు రెడ్డెమ్మ ఇంట్లో జరిగిన చోరీ కేసులో వీరబల్లి పోలీసులకు పట్టుబడ్డాడు. పగటి పూట పెయింటర్ గా పనిచేస్తూ.. రాత్రి పూట దొంగతనాలకు పాల్పడే వాడన్నారు. నిందితుడికి తల్లిదండ్రులు లేక పోవడంతో జులాయిగా మారి జల్సాలకు అలవాటు పడ్డాడని తెలిపారు. నిందితుడు షేక్ నౌమాన్ అలియాస్ మస్తాన్ అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో 4, కర్నూలు జిల్లాలోని బనగానపల్లిలో 1, కడపజిల్లాలోని ప్రొద్దుటూరులో 6, చిన్నచౌక్ లో 1, సీకే దిన్నె లో 1, యర్రగుంట్ల లో 1, వీరబల్లిలో 1 మొత్తం 15 చోరీ కేసులలో ముద్దాయిగా ఉన్నాడని వివరించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసిన వీరబల్లి ఎస్ఐ సుస్మిత, పోలీస్ సిబ్బందిని సీఐ సురేష్ రెడ్డి అభినందించారు.

# ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: మండల కేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను బుదవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు మజీత్లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రానికి చెందిన శాబోద్దీన్ అతని కుమారులు రహదారి పక్కన టెంట్లు వేసి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు పెద్దలు అందరు కలిసి మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను సంతోషంగా జరుపుకునా జరుపుకున్నారు.

# పిట్లం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు

**• జాబితా సవరణ కార్యక్రమాలు**



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆగస్టు 27న ఎన్యుమరేటర్ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేందర్ కుమార్ తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా, ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, సవరణల కోసం ప్రజలు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరై సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ మహేందర్ కుమార్ విజ్ఞప్తి చేశారు.